క్లుప్తంగా

స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ



సబ్‌కలెక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల పరిశీలకులు ఉమేష్‌కుమార్

ఆదోని రూరల్: స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదోని నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు ఉమేష్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆదోని ఆర్‌ఓ, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బంది, పోలీసు భద్రత అంశాలపై చర్చించారు. ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలని, పోలింగ్ కేంద్రాల్లో వివాదాలకు తావివ్వకుండా విధులు నిర్వహించాలని, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఎస్పీ శివనారాయణస్వామి, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

మంత్రాలయం: స్థానిక పరిమళ విద్యానికేతన్‌లో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను ఎన్నికల పరిశీలకుడు ఉమేష్‌కుమార్ పరిశీలించారు. అక్కడి పోలీస్ బందోబస్తు వివరాలు తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. సీఐ ఎరిసావలి, ఎస్‌ఐ గోపినాథ్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించాలి



28వ వార్డులో ప్రచారం చేస్తున్న బుట్టా సాహితి

ఎమ్మిగనూరుటౌన్: మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక తరఫున ఆమె కోడలు సాహితి పిలుపునిచ్చారు. ఆమె శుక్రవారం పట్టణంలోని 28వ వార్డులోని వెంకటాపురం కాలనీలో కౌన్సిలర్ బోయబజారి, పార్టీ శ్రేణులతో కలిసి విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సీఎం ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధిని వివరిస్తూ వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. టీడీపీ నాయకులు కేవలం ఓట్ల కోసం వస్తారని, ఆ పార్టీ నాయకుల మాయమాటలు నమ్మవద్దని సూచించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వాన్ని నిలబెట్టాలని కోరారు. వార్డు నాయకులు భాస్కర్‌రెడ్డి, రాజు, కె.యంకన్న నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కుటుంబసభ్యుల విస్తృత ప్రచారం



కల్లుబావిలో ప్రచారం చేస్తున్న మనోజ్‌కుమార్ రెడ్డి

ఆదోని టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ఆదోని ఎమ్మెల్యేగా వై.సాయిప్రసాద్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థిస్తూ శుక్రవారం ఆయన కుటుంబసభ్యులు ఇంటింటి ప్రచారం చేశారు. పట్టణంలోని 23, 24 వార్డుల పరిధిలోని కల్లుబావి, శంకర్‌నగర్, బీసీ కాలనీ, భంభం స్వామి ఆశ్రమం ఏరియాల్లో ఎమ్మెల్యే తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, కోడలు హిరణ్మయిరెడ్డి, కుమార్తెలు గౌతమి రెడ్డి, మనోవిద్యారెడ్డితో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకులు గడప గడపకు తిరుగుతూ ప్రచారం చేశారు. అవినీతిరహిత పాలన అందించిన వైఎస్ జగనన్నకు మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేశారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగనన్న బడుగు బలహీనవర్గాలకు అండగా నిలుస్తూ పెత్తందారులతో యుద్ధం చేస్తున్నారని, అందరూ ఆయనకు అండగా నిలవాలని విన్నవించారు. కూటమి కుట్రలను తిప్పి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, రేణుక, మంజుల, శ్రీలక్ష్మి, సుగుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ ఫీజు చెల్లించాలి

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజన్న శుక్రవారం తెలిపారు. అలాగే రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ 30 తేదీలోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చని వెల్లడించారు. మే 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు.

లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య

కోసిగి: ఇసుక లోడ్‌తో వెళుతున్న లారీ రైల్వేగేటు సమీపంలో రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో రైల్వే గేటు దాటిన వెంటనే లారీ క్లచ్‌ప్లేట్స్ విరిగి ఒక్కసారిగా నిలిచిపోయింది. తర్వాత 15 నిమిషాలకోసారి రైల్వే గేటు పడుతుండడంతో రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. గేటు తెరిచిన వెంటనే వాహనాల రాకపోకలకు సమస్య ఏర్పడింది. కొందరు స్కూటరిస్టులు గేటుకు కొద్ది దూరంలో రైలు పట్టాల కింద ఉన్న మోరీలో తలవంచుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. లారీ సాయంత్రం వరకు అక్కడే ఉండగా మరమ్మతులు చేసిన తర్వాత వెళ్లిపోయింది.

సంక్షేమ రారాజును సీఎం పీఠం ఎక్కిద్దాం

- ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక
- ఇబ్రహీంపురం, కొట్టాల, నదికైరవాడి గ్రామాల్లో రోడ్ షో



రోడ్‌షోలో అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

నందవరం: పేదల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నను మరోసారి సీఎం పీఠంపై కూర్చోబెడదామని వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పిలుపునిచ్చారు. ఆమె శుక్రవారం నందవరం మండల పరిధిలోని ఇబ్రహీంపురం, కొట్టాల, సాయంత్రం నదికైరవాడి, కొత్తకైరవాడి గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ప్రచార వాహనం పైనుంచి ఆమె మాట్లాడుతూ.. సీఎం జగనన్న గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన అందించారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, పేదల జీవితాల్లో వెలుగులు నిండాలన్నా సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు (ఎంపీ, ఎమ్మెల్యే) ఫ్యాన్ గుర్తుకు వేయాలని విన్నవించారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించానని, ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిపిస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

నవరత్నాలతో పేదల ఇళ్లలో వెలుగులు : బీఆర్ బసిరెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాలతో పేదల ఇళ్లలో వెలుగులు నింపారని పార్టీ సీనియర్ నాయకులు బీఆర్ బసిరెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగనన్న స్థాపించారన్నారు. సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు నాణ్యమైన, వేగవంతంగా సేవలు అందించేందుకు వీలు పడుతుందన్నారు. పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి,సర్పంచులు నాగేశ్వరరెడ్డి, ఈశ్వరమ్మ, ఎంపీటీసీ బీసమ్మ, నాయకులు పేట శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ షోలో జన నీరాజనం



వైఎస్సార్‌సీపీ జెండాలతో యువత సందడి

నందవరం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుట్టా రేణుక నందవరం మండలంలో నిర్వహించిన రోడ్ షో పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపింది. గ్రామాల్లో కార్యకర్తలు, అభిమానులు, ప్రజలలు బుట్టా రేణుకకు నీరాజనం పలికారు. శుక్రవారం మండలంలోని ఇబ్రహీంపురం, కొట్టాల, నదికైరవాడి, కొత్తకైరవాడి, యనాం గ్రామాల్లో చేపట్టిన రోడ్ షోకు కార్యకర్తలు బ్యాండు మేళాలు, డ్రమ్స్‌లతో పాటు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. మహిళలు సైతం వైఎస్సార్‌సీపీ జెండాలు, టోపీలు, కండువాలు, ప్లకార్డులతో ఉత్సాహంగా పాల్గొన్నారు. యువకులు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేందుకు తామంతా సిద్ధం అంటూ సీఎం జగనన్న చిత్రంతో ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. రోడ్ షోలో చిందులేశారు. అనంతరం బుట్టా రేణుక ప్రసంగం యువత, మహిళలను ఆకట్టుకుంది. వైఎస్సార్‌సీపీ నాయకులు బీఆర్ బసిరెడ్డి, బుట్టా నీలకంఠప్ప, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



బుట్టా రేణుక సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన 5వ వార్డు కార్యకర్తలు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక సమక్షంలో 5వ వార్డుకు చెందిన పలువురు ఆ పార్టీలో చేరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, 5వ వార్డు కౌన్సిలర్ అమాన్ ఆధ్వర్యంలో ఆ వార్డులోని టీడీపీకి చెందిన వారితో పాటు పలువురు యువకులు మహాత్మా, రవి, వీరేష్, చాంద్‌బాష, శేక్షావలి, ఖాశింబాష, మునీశ్వర్, చంద్ర, సైఫ్, హరి, సురేంద్రగౌడ్, దేవేంద్ర, రంగాలతోపాటు మరో వంద మంది వైఎస్సార్‌సీపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకొనేందుకు కృషి చేయాలని వారికి సూచించారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి



గోనెగండ్లలో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతుల్

గోనెగండ్ల: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బుట్టా ప్రతుల్ కోరారు. ఆయన శుక్రవారం గోనెగండ్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీవర్స్ కాలనీ, మైనార్టీ కాలనీ, చదువుల రామయ్య కాలనీ, నాయి బ్రహ్మణ కాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. నియోజకవర్గ మొదటి మహిళా ఎమ్మెల్యేగా బుట్టా రేణుకకు పట్టం కట్టాలని, టీడీపీ నాయకుల మోసపూరిత హామీలు నమ్మవద్దని సూచించారు. నాయకులు బందెనవాజ్, మన్సూర్, మురళి నాయుడు, రవి కుమార్, గోవింద్ తదితరులు ఉన్నారు.

నేడు పాలీసెట్ ప్రవేశపరీక్ష

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరం ప్రవేశాలకు శనివారం ప్రవేశ పరీక్ష (పాలీసెట్) జరగనున్నట్లు స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సుధాకర్‌రెడ్డి తెలిపారు. పరీక్షకు ఆదోని పట్టణంలో 10 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 3012 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఆదోని బరిలో 11 మంది అభ్యర్థులు



మాట్లాడుతున్న ఆర్వో, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆదోని నియోజకవర్గం–146కు నుంచి మొత్తం 15 మంది అభ్యర్థులు 23 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం స్థానిక ఆర్వో కార్యాలయంలో నామినేషన్ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని ఆర్‌ఓ, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో వివిధ కారణాల చేత నలుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించినట్లు ఆర్‌ఓ తెలిపారు. ఇందులో వై.మనోజ్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), పి.వి.చంద్రకళ (బీజేపీ), నాగరాజ్ ప్రకాష్‌జైన్ (బీజేపీ), బి.ప్రభాత్‌రెడ్డి (ఇండిపెండెంట్) నామినేషన్లు తిరస్కరించినట్లు చెప్పారు. 11 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో వై.సాయిప్రసాద్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), ఆసియాబాను, (బీఎస్పీ), పార్థసారథి (బీజేపీ), గణేష్‌యాదవ్ (కాంగ్రెస్), రంగన్న (జైభీమ్‌రావు పార్టీ), ఉరుకుంద, నాగరాజు, భాగ్యలక్ష్మి, యువరాజ్, దస్తగిరినాయుడు, జయన్న ఇండిపెండెంట్ అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందినట్లు ఆర్‌ఓ వెల్లడించారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రెండు నామినేషన్ల తిరస్కరణ

మంత్రాలయం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరిగింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎ.మురళీ నేతృత్వంలో నాయకుల సమక్షంలో మంత్రాలయం అసెంబ్లీ స్థానానికి దాఖలైన నామినేషన్ పత్రాలను పరిశీలించారు. మొత్తం 12 మంది అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిలో సరైన వివరాలు లేని రెండు నామినేషన్లను తిరస్కరించారు. స్వతంత్ర అభ్యర్థులు వై.సీతారామిరెడ్డి, గుడిసె పెద్ద రామాంజనేయులు వేసి న నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 10 మంది అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించబడ్డాయి. నామినేషన్ల పరిశీలనలో తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, నాయకులు భీమిరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, గురురాజారావు, మురళీకృష్ణరాజు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో పది మంది అభ్యర్థుల పోటీ

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు అసెంబ్లీ స్థానానికి పది మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఆర్‌ఓ చిరంజీవి తెలిపారు. ఆయన శుక్రవారం అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మిగనూరు అసెంబ్లీ స్థానానికి 15 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు చెప్పారు. వీటిలో ఐదు నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ తరఫున బుట్టా రేణుక, టీడీపీ నుంచి బీవీ జయనాగేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నుంచి ఖాశింవలి, బీఎస్పీ నుంచి రాఘవేంద్ర, జాతీయ జనసేన నుంచి నాగార్జున రెడ్డి పోటీలో ఉండగా ఇండిపెండెంట్లుగా విజయలక్ష్మి, గువ్వల నారాయణ, మిట్టా రాజశేఖర్, జగన్నాథ్ ఈరన్న, గొల్ల ఈరమ్మ బరిలో ఉన్నట్లు తెలిపారు. నామినేషన్లు తిరస్కరించడానికి గల కారణాలను ఆర్వో వివరించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఆయా పార్టీల నాయకులకు సూచించారు.

సురక్షతో నాణ్యమైన వైద్య సేవలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

కౌతాళం: ఆరోగ్య సురక్షతో ప్రజలకు గ్రామంలోనే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని డాక్టర్లు అయిషాజుబేదా, శ్రీకర్‌రెడ్డి, సతీష్‌యశ్వంత్ అన్నారు. మండల పరిధిలోని రౌడూరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహించగా ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వైద్య సేవలు పొందారు. మొత్తం 150 మంది వైద్య సేవలందుకున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఆయా రోగాలతో బాధపడుతున్న వారికి హైపర్‌టెన్షన్, డయాబెటిస్, హిమోగ్లోబిన్, మలేరియా, టీబీ, డెంగ్యూ, యూరిన్ టెస్ట్, ఈసీజీ తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యదర్శి అబ్దుల్‌వాహిద్, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

కోసిగి: ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని కోసిగి ప్రాథమిక వైద్యాధికారి మనోజ్‌కుమార్ సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని అగసనూరు గ్రామంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 369 మంది ఓపీ ద్వారా వివిధ రకాల వైద్యసేవలు పొందారు. కంటి పొర సమస్య ఉన్న 10 మందిని గుర్తించి వారికి కళ్లద్దాల కోసం రెఫర్ చేయించారు. షుగర్, బీపీ, రక్తహీనత, కాళ్లు, కీళ్ల నొప్పులు ఉన్న వారికి పరీక్షలు చేసి మందులు అందించారు. డాక్టర్ మాట్లాడుతూ.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లరాదన్నారు. జనరల్ సర్జన్ డాక్టర్ బాబు, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, యల్లప్ప, హెల్త్ సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పెత్తందారీ పోకడలను అణచివేద్దాం



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



ఇస్వీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే

- రాష్ట్రంలో పేదలు, పెత్తందార్లకు మధ్య యుద్ధం
- పేదల పక్షాన పోరాడుతున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దాం
- సంక్షేమ పాలన కొనసాగాలంటే ఫ్యాన్‌కు ఓటెయ్యడమే ఏకైక మార్గం
- కూటమి కుట్రలను తిప్పికొట్టాలి

ఆదోని రూరల్: రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ధనికులకు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధం లాంటివని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. పేద ప్రజల సమస్యలపై సీఎం జగనన్న యుద్ధం చేస్తుంటే పెత్తందారులంతా కూటమిగా చేరి పేదలను నాశనం చేసేందుకు పూనుకున్నారని, రాష్ట్ర ప్రజలు గమనించి ప్రతిపక్ష పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. పెత్తందారీ పోకడలను అణచివేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఇస్వీ, కడితోట, జి.హొసళ్లి, హాన్వాల్ గ్రామాల్లో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రచార రథంపైనుంచి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. గతంలో చంద్రబాబునాయుడు 600 హామీలిచ్చి అధికారం చేపట్టాక అమలుచేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశాడన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు నేనున్నాననే భరోసా కల్పించారని ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని గుర్తుచేశారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారన్నారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా వివిధ సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది రూపాయలను లబ్ధిదారుల ఖాతాలో జమచేశారని వివరించారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. మార్పు అంటే ఇది కాదా అంటూ ప్రజలను ప్రశ్నించారు. టీడీపీ హయాంలో పింఛన్ల పంపిణీ ఎలా ఉండేదో ఒకసారి గుర్తు చేసుకోవాలని, పేదల కష్టాలు తెలిసిన జగనన్న సీఎంగా ఉండడం ప్రజల అదృష్టమన్నారు. పేదల పక్షాన పోరాటం సాగిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని, సంక్షేమ రాజ్యం కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయడమే ఏకైక మార్గం అని వివరించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీవై రామయ్యను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, మురళీరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, గురునాథరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


జగనన్నతోనే బ్రాహ్మణులకు సముచిత స్థానం




మాట్లాడుతున్న ఏపీ దేవదాయ ధర్మదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్

ఆదోని అర్బన్: సీఎం జగనన్నతోనే బ్రాహ్మణులకు సముచిత స్థానం లభిస్తోందని దేవదాయ ధర్మదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ స్పష్టం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం కర్నూలు జిల్లా కార్యదర్శి వెల్లాల మధుసూదన శర్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతో పాటు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సేరి కామేశ్వరరావు, డైరెక్టర్ మంగళంపల్లి అంజిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే రూ.500 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కేవలం రూ.135 కోట్లు మాత్రమే ఇచ్చి మోసగించారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రాహ్మణులకు నలుగురికి ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం కల్పించారని, సంక్షేమ పథకాల ద్వారా రూ.600 కోట్లు బ్రాహ్మణ జాతికి లబ్ధి చేకూరిందన్నారు. పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే బ్రాహ్మణులందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని,అలాగే ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక





ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు, రాంపురంలో చేరికలు

కౌతాళం: మండల పరిధిలోని మరళి గ్రామ ఉప సర్పంచ్ రాజశేఖర్‌గౌడ్, ముదకప్ప, హనుమేష్, లింగన్నలతో పాటు మరో 10 కుటుంబాల వారు శుక్రవారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన రాజశేఖర్‌గౌడ్, ముదకప్ప, హనుమేష్, లింగన్న మాట్లాడుతూ.. గత పదేళ్ల నుంచి టీడీపీలో ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు పేదలందరికీ నేరుగా అందుతున్నాయన్నారు. సంక్షేమ సారధి పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు.

కోసిగి: మండల పరిధిలోని ఆర్లబండ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు మజ్జిగ దుర్గయ్య, తిప్పలదొడ్డి మహదేవాతో పాటు మరో 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. శుక్రవారం రాత్రి రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి , గ్రామ నాయకులు గొల్ల పరుశురాం, హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా ఎమ్మెల్యే స్వయంగా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన కార్యకర్తలు పి.బాషా, కరిణి శ్రీను, వెంకన్న, గోపాల్, కృష్ణమూర్తి, హనుమేష్, మౌలా, ఖాదర్ బాషా, తదితరులు ఉన్నారు.

జగనన్నతోనే పేదల అభ్యున్నతి

నందవరం: రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా శ్రమిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం నదికైరవాడిలో మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం సీఎం జగనన్న నవరత్నాలు ప్రవేశపెట్టి ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. నదికై రవాడి, కొత్తకైరవాడి గ్రామాలకు రూ.60 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, రూ.7 లక్షలతో తుంగభద్ర నది నుంచి తాగునీటి పైపులైన్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గ్రామ సర్పంచ్ ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్‌కుమార్, కృష్ణమూర్తి, డీలర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమికి ఓటేస్తే ముస్లిం రిజర్వేషన్లు ఉండవు



ఎమ్మిగనూరులో ప్రచారం చేస్తున్న ముస్లిం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ముస్లిం రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం అని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రకటించడంతో రాష్ట్రంలో ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేనపై ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు ఖాశింబేగ్, వాహిద్, ఇషాక్, షాబుద్దీన్, ఖిబ్రియ, జీఎం బాష, గట్టుఖాజ, సయ్యద్‌చాంద్ తదితరులు శుక్రవారం పట్టణంలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలను కలిసి తమ రిజర్వేషన్లను తొలగించాలనుకున్న బీజేపీతో జత కట్టిన టీడీపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. ముస్లిం రిజర్వేషన్లను కొనసాగించే వారికి మద్దతు ఇవ్వాలని కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. అన్ని విధాలుగా వెనుకబడ్డ ముస్లింల అభ్యున్నతి కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొనసాగిస్తున్నారని గుర్తుచేశారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్న బీజేపీతో టీడీపీ, జనసేన పార్టీలు అంటకాగడం ఎంతవరకు సమంజసమని, ఆ కూటమికి ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

4 శాతం రిజర్వేషన్లతో అవకాశాలు



దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కల్పించిన 4 శాతం రిజరేషన్లతో ముస్లిం మైనారిటీ కుటుంబాలు బాగుపడ్డాయి. విద్య, ఉద్యోగ అవకాశాలు పొంది ముస్లిం యువత స్థిరపడింది. కేంద్రంలోని బీజేపీ ముస్లిం రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్రలు పన్నుతోంది. అందుకే ఎన్నికల్లో ఆ పార్టీతో జతకట్టిన కూటమిని చిత్తుగా ఓడించి వైఎస్సార్‌సీపీకి మద్దతిస్తే రిజర్వేషన్లు యథావిధిగా కొనసాగుతాయి.

– రియాజ్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు, ఎమ్మిగనూరు

టీడీపీ, బీజేపీతో ముస్లింలకు చేటు



ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ఓటేస్తే ముస్లింలకు ఇబ్బందే కాని ఎలాంటి ప్రయోజనం ఉండదు. ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ రోజుకోమాట చెబుతుండడంతో ముస్లింలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ముస్లిం తమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని బీజేపీతో జతకట్టి ఎన్నికల్లో గెలవాలనుకున్న కూటమికి బుద్ధి చెప్పి వైఎస్సార్‌సీపీని గెలిపించాలి.

– వాహిద్, మున్సిపల్ కౌన్సిలర్, ఎమ్మిగనూరు